గ్రామీణ రహదారులకు మోక్షం


నూకలవాడ రోడ్డు


శివరాంపురం రోడ్డు

బలిజిపేట: మండలంలోని గ్రామీణ రహదారులకు మోక్షం కలిగింది. ప్రధాన రహదారి నుంచి గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ రోడ్డు నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దశాబ్దాల కాలం నుంచి సరైన రహదారి సదుపాయం లేక ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధానంగా రహదారి సదుపాయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రభుత్వ సహకారంతో స్థానిక ఎమ్మెల్యే జోగారావు కృషితో మండలంలో 25కిలోమీటర్ల పొడవున 11బీటీ రోడ్ల నిర్మాణాలు రూ.25కోట్లతో జరుగుతున్నాయి. అందులో భాగంగా కొన్ని గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణాలు పూర్తి కాగా మరి కొన్ని గ్రామాలకు నిర్మాణాలు జరుగుతున్నాయి. మండలంలోని గేదెల పేట నుంచి బాగెంపేట వరకు బీటీరోడ్డు నిర్మాణం, కూరుంపురం జంక్షన్ నుంచి నూకలవాడకు, అరసాడ రోడ్డునుంచి శివరాంపురం మీదుగా పణుకువలస రోడ్డు, బర్లి నుంచి సుభద్ర వరకు, నారాయణపురం బ్రిడ్జి నుంచి పెద్దింపేటవరకు, బలిజిపేట సంతతోట నుంచి తుమరాడవరకు బీటీ రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. అదేవిధంగా గలావల్లి నుంచి కొత్తగలావల్లి, నారన్నాయుడువలస నుంచి శ్రీరంగరాజపురం, వంతరాం నుంచి చినవంతరాం వరకు, నూకలవాడ జంక్షన్ నుంచి పెదపెంకి వరకు, నారాయణపురం శివాలయం నుంచి పదమాయవలస ప్రధాన రహదారి జంక్షన్‌కు, తుమరాడ జంక్షన్ నుంచి గ్రామంలోకి, చెల్లెంపేట జంక్షన్ నుంచి చెల్లెంపేట గ్రామంలోకి జీఎస్పీతో రోడ్డు నిర్మాణాలు పూర్తి చేశారు. వీటికి బీటీ రోడ్ల నిర్మాణం పూర్తికావాల్సి ఉంది. అలాగే పి.చాకరాపల్లి నుంచి అజ్జాడవరకు 4కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం చేస్తున్నారు.

ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం

మండలంలోని ప్రధాన రహదారుల నుంచి గ్రామీణ ప్రాంతాలను కలుపుతున్న రోడ్లను బీటీ రోడ్లుగా మారుస్తాం. మండలంలో బీటీరోడ్డు లేని గ్రామం ఏదీ ఉండదు. సుమారు రూ.25కోట్లతో 25కిలోమీటర్ల పొడవు కలిగిన బీటీ రోడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశాం. కొన్ని పూర్తయ్యాయి, కొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. ఒకటి, రెండు ప్రారంభించాల్సి ఉంది.

అలజంగి జోగారావు, ఎమ్మెల్యే, పార్వతీపురం

వంతరాం ఆర్బీకేకి చేరిన విత్తనాలు


వంతరాం ఆర్బీకేలో విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ శ్రావణ్

బలిజిపేట: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వంతరాం ఆర్బీకేకి విత్తనాలు అందుబాటులోకి వచ్చాయని ఏఓ శ్రావణ్ తెలిపారు. మండలంలోని అన్ని ఆర్బీకేలకు మూడు రోజుల్లో విత్తనాలు వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. రైతులు ముందస్తుగా డి-క్రిషి ద్వారా ఆర్బీకేలలో బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆతరువాత రైతు కట్టాల్సిన నాన్ సబ్సిడీ మొత్తాన్ని చెల్లించి విత్తనాలు తీసుకోవచ్చన్నారు. అందులో భాగంగా వంతరాం ఆర్బీకేకి 1121రకం 114క్వింటాళ్లు, స్వర్ణ 3క్వింటాళ్లు, 1064రకం 3క్వింటాళ్ల విత్తనాలు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణంలో గురువారం విద్యుత్ సరఫరాకు 3 గంటలపాటు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఎఈ రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ పార్వతీపురం సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ మెయింటనెన్స్ వర్క్ జరగనున్న కారణంగా అర్బన్‌లో పరిధిలో ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. పార్వతీపురం సబ్ స్టేషన్‌కు సంబంధించి అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు కావున ప్రజలు సహకరించాలని కోరారు.

ఈదురుగాలి, వడగళ్లతో వర్షం


మండలకేంద్రంలో వడగళ్లతో కురిసిన వాన

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం 2 గంటలవరకూ తీవ్రమైన ఎండ కాయగా 3 గంటల నుంచి ఈదురుగాలి, వడగళ్లతో వర్షం కురవడంతో పొలాలకు వెళ్లిన రైతులు, మామిడి రైతులు అవస్థలు పడాల్సి వచ్చింది. అన్ని గ్రామాల్లో ఒకేవిధంగా ఈదురుగాలి వీయడంతో పలు చోట్ల చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లపై పడిపోగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మామిడి కాయలు రాలిపోవడంతో రైతులు విలవిలలాడుతున్నారు.

మక్కువలో గాలివాన బీభత్సం


మక్కువలో రహదారికి అడ్డంగా నేల కొరిగిన చెట్టు, విద్యుత్ వైర్లు

మక్కువ: మండలంలో బుధవారం సాయంత్రం గాలులతో కూడిన వర్షం బీభత్సం సష్టించింది. దీంతో ఎక్కడికక్కడ చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కొరగ్గా విద్యుత్ వైర్లు తెగి కింద పడ్డాయి. పలు గ్రామాల్లో రహదారికి అడ్డంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌కో ఏఈ శాంతారావు విద్యుత్ పునరుద్ధరించేందుకు సిబ్బందితో పనులు జరిపిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శులు గ్రామాలభివృద్ధికి తోడ్పడాలి


మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నాగభూషణరావు

సీతానగరం: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి తోడ్పడాలని డీఎల్‌పీఓ నాగభూషణరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు, తాగునీరు సరఫరా, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, జగనన్న ఇళ్ల నిర్మాణాలు, ఇళ్ల పన్నుల వసూలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని కార్యదర్శులు విజయవంతం చేయాలని కోరారు. అలాగే చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చి సంపద తయారుచేసి వచ్చిన ఆదాయంతో గ్రామాలను అభివృద్ధి చేయడానికి వినియోగించాలని సూచించారు. అలాగే ఇంటి పన్నులు వసూలు చేసి గ్రామాల్లో అభివృద్ధి చేపట్టడానికి లిఖిత పూర్వకంగా వినియోగించాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలపై పాలకవర్గాలతో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రధానంగా వేసవి కాలం కావడంతో నిరంతరం తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం


వలంటీర్లకు సన్మానం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు

పాచిపెంట: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటుచేసిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు అన్నారు. ఈ మేరకు మండలంలోని పి.కోనవలస, విశ్వనాథపురం, పణుకువలస గ్రామసచివాలయాలకు సంబంధించిన వలంటీర్లకు పి కోనవలసలో ఎంపీడీఓ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వీరంనాయుడు మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హుడైన ప్రతి పేదవాడికి అవినీతి రహితంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా అందుతున్నాయన్నారు. ప్రజలకు సేవ చేసుకునే మంచి అవకాశాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్లకు కల్పించారన్నారు. ఈ అవకాశాన్ని వలంటీర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొర్లి గణపతి, మాజీ ఎంపీపీ కిర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీలు తోకల లక్ష్మి, తాడంగి సింహాచలం, సర్పంచులు చెల్లూరి సీతారాం, సుందర రావు పెద్దింటి గంగమ్మ, కొట్టేసి మంగమ్మ నాయకులు గుణాపు తిరుపతిరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల నిరసన


రిలేదీక్షలు చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యులు

కురుపాం: తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు కె.నాగేంద్రసాయి ఆధ్వర్యంలో ఉద్యోగులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కాపు శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టభద్రత అవసరం

పాలకొండ రూరల్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టభద్రత అవసరమని ఉత్తరాంధ్రా జిల్లాల ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకుడు ముమ్ముడివరపు చిన్నసుబ్బారావు అన్నారు. పాలకొండ పట్టణంలోని కష్పావీధిలో బుధవారం ఎంఆర్‌పీఎస్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ శ్రీకాకుళం రానున్నట్లు తెలిపారు. త్వరలో నిర్వహించనున్న 'గో టూ విలేజెస్ టూ ఫీల్డ్ డేస్' కార్యక్రమానికి సంబంధించిన కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నట్లు చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్, అనుబంధ సంఘాల సభ్యులు, మేధావులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ జిల్లా కన్వీనర్, కో కన్వీనర్ లోపింటి కృష్ణ, తేజా, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షుడు గుంట మోహనరావు, బోగి జేమ్స్, సారిక రమేష్, సుధా, పకీరునాయుడు, నత్తల కృష్ణ, అలజంగి చిన్నారావు, ఎస్.భాస్కరావు, యందవ మరియదాసు తదితరులున్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత


వైఎస్సార్‌బీమా సాయం అందిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరు: పట్టణంలోని 24వ వార్డు ఎరుకుల వీధి పరిధికి చెందిన మైసర్ల పైడయ్య అనారోగ్యంతో మరణించగా మృతుని కుటుంబానికి మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు, నాయకులు వైఎస్సార్‌బీమా నగదు రూ.10 వేలు బుధవారం అందించారు. మృతుని కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి.మధుసూదనరావు, శంకర్రావు, వెంకటనాయుడు, ఈదుబిల్లినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మౌలికసదుపాయాలు కల్పించండి


ఎంపీడీఓ భానుమూర్తికి వినతిపత్రం అందిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు


బలిజిపేట: తమకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం గ్రీన్ అంబాసిడర్లు ధర్నా నిర్వహించారు. నిరుపేదలైన గ్రీన్ అంబాసిడర్లకు సంబంధించి పేరుకుపోతున్న సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. రాజకీయ ఒత్తిడి లేకుండా చూడాలని కోరారు. గ్రీన్ అంబాసిడర్లను భయభ్రాంతులకు గురిచేయరాదన్నారు. ఈ మేరకు వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ భానుమూర్తికి అందించారు.

ఆర్బీకే ప్రారంభం


కోనలో ఆర్‌బీకేని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

మక్కువ: మండలంలోని కోన గ్రామంలో బుధవారం రైతు భరోసా కేంద్రాన్ని ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రంగునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయం పరిధిలో రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. విత్తనాలు, ఎరువులకోసం గతంలో రైతులు మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రైతు ముంగిటికే సేవలు అందుతున్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్ల పరిశీలన


విద్యా కానుక కిట్లు పరిశీలిస్తున్న డీఈవో ప్రేమ్ కుమార్

పాచిపెంట: 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి మండలానికి వచ్చిన విద్యా కానుక కిట్లను పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్ బుధవారం పరిశీలించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యా కానుక కిట్లు సకాలంలో పంపిణీ పూర్తి చేయాలని ఎంఈఓ జోగారావును ఈ సందర్భంగా ఆదేశించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి


మాదలింగి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కొమరాడ: గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన సేవలందించాలని ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు అన్నారు. మండలంలోని పాలేం, మాదలింగి సచివాలయాలను బుధవారం ఆయన సందర్శించారు. సిబ్బంది హాజరు, వారి పనితీరు, కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. పౌరసేవలకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మాదలింగి పీహెచ్‌సీని సందర్శించి రోగులకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాదలింగి సర్పంచ్ తుమరాడ కళావతి, పీహెచ్‌సీ వైద్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పాల్గొనే వారికే మస్తరు వేయాలి


మస్తరు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో పాల్గొనే వేతనదారులకు మాత్రమే మేట్‌లు మస్తరు వేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం గాదెలవలస గొడిబందలో వేతనదారులు చేస్తున్న పనులను, వేతనదారుల మస్తరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని కొన్నిగ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న వేతన దారులనుంచి బిల్లుల విషయమై ఇబ్బందులు పడుతున్నారని, పనుల్లో పాల్గొనని వారికి మస్తరు వేస్తున్నారని సమాచారం వస్తోందన్నారు. వేతన దారుల బ్యాంక్ ఖాతా నంబర్ ఉన్న అకౌంట్లలో వేతనాలు జమఅవుతున్నాయని, బ్యాంక్ అకౌంట్ నంబర్లు తప్పులు, ఆధార్ సీడింగ్ అప్‌డేట్ చేయించుకోని వారికి, సాంకేతిక పరమైన సమస్యలున్న వారికి బిల్లులు ఆలస్యమవుతున్నాయని అన్నారు. వేతనదారులు గ్రామ వలంటీర్ల సహకారంతీసుకుని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. లేదా ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడికి తెలియ జేయాలని చెప్పారు. అలాగే గ్రామాల్లో ఎటువంటి సమస్యలనైనా ఎదుర్కొనే వారు జగనన్నకు చెబుదాం ద్వారా సచివాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలులో భాగంగా మండలంలోని రెండుగ్రామాలనుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించినట్లు చెప్పారు.

చినభోగిలిలో పారిశుద్ధ్య పనులు


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా బుధవారం చినభోగిలిలో సర్పంచ్ కురమాన రాధ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి మనోహర్ పారిశుద్ధ్య పనులు చేయించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మనోహర్ , ఉపసర్పంచ్ జి రమేష్ మాట్లాడుతూ గ్రామానికి ఆనుకుని ఉన్న రాష్ట్ర రహదారికి ఇరువైపులా చెత్త పేరుకు పోవడంతో జేసీబీతో తొలగింపు చర్యలు చేపట్టామన్నారు. తొలగించిన చెత్తతో పాటు కాలువల్లో తీయించిన చెత్తను దూరప్రాంతానికి తరలించినట్లు చెప్పారు. ఇళ్లలోని చెత్తను రోడ్లపై వేయకుండా ప్రతిరోజూ ఉదయాన్నే ఇళ్లముందుకు వస్తున్న చెత్తసేకరణ బళ్లకు అందజేయాలని కోరారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి, వ్యాధుల బారినుంచి విముక్తి పొందడానికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జి బుజ్జి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి కుళాయి, సీసీరోడ్డు పనులకు భూమిపూజ


అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రాధాన్యం ఇస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలు రెండవ పర్యాయం ముఖ్యమంత్రిగా చేయడానికి ఓట్లు వేసి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు మండలంలోని బూర్జ గ్రామ ప్రజల కోరిక మేరకు ఎస్సీకాలనీలో బుధవారం రూ.5 లక్షలవ్యయంతో సీసీ రోడ్డు, లక్షలాది రూపాయల వ్యయంతో ఇంటింటి కుళాయిల నిర్మాణం పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.1.28 కోట్లతో వెంకటాపురం-లక్ష్మీపురం, పణుకుపేట నుంచి కేఎస్ పురం, కేఎస్ పురం నుంచి పణుకు వలస వరకు, పెద్దింపేట నుంచి ఎస్ఎస్ పురం, ఎస్ఎస్ పురం నుంచి గుచ్చిమి వరకూ సీసీ రోడ్డు, అంటిపేట నుంచి రామవరం బీటీరోడ్డు ఆర్ వెంకంపేట నుంచి కాశీపేట జంక్షన్ వరకు, చినంకలాం నుంచి పణుకుపేట జంక్షన్ వరకూ బీటీరోడ్ల నిర్మాణం పూర్తిచేసినట్లు తెలియజేశారు. తోటపల్లి కాలువ పనులు మంజూరుచేసినట్లు చెప్పారు. అలాగే వలంటీర్ వ్యవస్థను తేవడంతో పారదర్శకంగా పాలన సాగిస్తున్నామన్నారు.

భూముల రీ సర్వేలో మోడిఫికేషన్‌కు మార్గదర్శకాలు


మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: జగనన్న సంపూర్ణ 'భూ'రక్ష 'భూ'హక్కు పథకం అమలులో భాగంగా కొత్తగా మోడిఫికేషన్ చేస్తూ వచ్చిన విధానాలపై రీసర్వే సిబ్బంది అవగాహన కల్పించుకుని మెరుగైన సేవలందించడానికి సిద్ధం కావాలని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సమగ్ర 'భూ హక్కు'భూ రక్ష పథకంలో భాగంగా 2020 నుంచి రీ సర్వే పనులు ప్రారంభించినట్లు తెలియజేశారు. రీసర్వే పనులు ప్రారంభదశలోనే కోవిడ్ ఎమర్జెన్సీ అమలు చేయడంతో ఆలస్యమైందన్నారు. ఆలస్యం కారణంగా భూముల కొనుగోలు, విక్రయాలు ప్రభుత్వ భూముల రక్షణ నిమిత్తం రీసర్వేలో కొత్తగా మోడిఫికేషన్ చేస్తూ మార్గదర్శకాలు విడుదలైనట్లు తెలియజేశారు. రీసర్వే విషయంలో మరింతకట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటూ మోడిఫికేషన్ చేస్తూ కార్యాలయాలకు సమకూర్చిన బుక్‌లెట్ ద్వారా సచివాలయాల సర్వేయర్లు, వీఆర్వోలకు, రీసర్వే సిబ్బందికి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

ఉపముఖ్యమంత్రిపై తప్పుడు విమర్శలు దురదృష్టకరం


మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరు: భారత రాజ్యాంగాన్ని, చట్టాలను గౌరవిస్తూ సౌమ్యుడైన నిబద్ధత గల నేతగా గుర్తింపు పొందిన ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖమంత్రి పీడిక రాజన్నదొర గురించి ఒడిశా నాయకులు తప్పుడు విమర్శలు చే యడం దురదృష్టకరమని ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మువ్వల ఆదయ్య, దండి శ్రీనివాసరావు, తాడంగి నాగయ్య, మువ్వల పెంటయ్య తదితరులు మండిపడ్డారు. ఈ మేరకు మండలంలోని తోణాంలో బుధవారం విలేకరులతో వారు మాట్లాడారు. ఒడిశాలోని గంజాం జిల్లా బరంపురంలో ఒడియా భాష ఆందోళన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు త్రినాథ మహారాణా, కొన్ని సంస్థల ప్రతినిధులతో కలిసి కొఠియా గ్రామాల విషయంలో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు వ్యతిరేకంగా ఆందోళన చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కొటియా గ్రామాలపై కుట్రలు చేస్తూ, స్వలాభం కోసం కొందరు ఒడిశా నాయకులు అక్కడి ప్రజలను రెచ్చగొట్టే దురుద్దేశంలో భాగంగా రాజన్నదొరపై విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.